క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

పోరుమామిళ్ల : విశాలాంధ్ర దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం తహసీల్దారు విజయకుమారి, ఎస్‌ఐ హరిప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ సీఐ యుగంధర్ అన్నారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో గురువారం యూత్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు జరుగుతాయన్నారు. యువత జాగ్రత్తగా వాహనం నడపాలని, అతివేగం పనికి రాదన్నారు. ఎంపీజే రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీం, జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, నజీర్, అస్లం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సుజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థి పి.కళాధర్ ఆర్‌ఆర్‌బీ ఎన్‌టీపీసీ సికింద్రాబాద్ లెవెల్ 5 విడుదల చేసిన ఫలితాల్లో సీనియర్ కమర్షియల్ కం టికెట్ క్లర్క్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు సుజన్, సునీల్, విద్యార్థి తల్లిదండ్రులు గంగాధర్, అంజనమ్మ, అధ్యాపకులు తదితరులు అతన్ని అభినందించారు.

నేడు సీబీఐటీలో సంక్రాంతి సంబరాలు

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో రంగవల్లులు, గాలిపటాలు ఎగురవేయటం, బొంగరాలు, గంగిరెద్దులు, హరిదాసు, వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

18న నమూనా కానిస్టేబుల్ పరీక్ష

ప్రొద్దుటూరు : నమూనా కానిస్టేబుల్ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నమూనా పరీక్షలు చాలా ఉపయోగపడుతాయన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ఈనెల 18న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, వెంకటేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని ఎకో పార్కులో గురువారం స్పోర్ట్స్ అండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షెటిల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జునరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలపై నిషేధం తగదు

ప్రొద్దుటూరు కల్చరల్ : పర్యావరణ పరిరక్షణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెక్సీలపై నిషేధం విధించడం తగదని సజన శ్రీను పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రొద్దుటూరు ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 2వేల ఫ్లెక్సీ ప్రింటిగ్ షాపులు ఉన్నాయని సుమారు రెండు లక్షల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. జనవరి 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెక్సీలను నిషేధించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. 100 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులను మాత్రమే నిషేధించాలని, కానీ తాము ఉపయోగించేది 220 మైక్రాన్‌ల కంటే ఎక్కువ ఉన్న ఏకో ఫ్లెక్స్ ఇవి సంవత్సరంలోపే మట్టిలోపే కలిసిపోతాయన్నారు. ఫ్లెక్సీల నిషేధంపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. రమేష్ రెడ్డి, రమణ, ఖాదర్‌బాష, శివ, మల్లి, నరసింహా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు వినతి

బద్వేలు అర్బన్ : డీకేటీ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్ల తరబడి నివసిస్తున్న తమ ఇళ్లను క్రమబద్ధీకరించాలని గురువారం విద్యానగర్ వాసులు ఆర్డీఓ ఆకుల వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బంగారునాగయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు కొప్పులశివ, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిలు మాట్లాడుతూ విద్యానగర్ పరిసర ప్రాంతాల్లో అధిక శాతం సోమశిల మునక ప్రాంతానికి చెందిన ప్రజలు నివసిస్తున్నారని, సుమారు 18 సంవత్సరాల క్రితం డీకేటీ భూములను కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు.

ప్రజలకు చేరువ కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం

బద్వేలు అర్బన్ : అవినీతికి తావు లేకుండా.. పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావాలన్న ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని పుట్టాయపల్లె పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామస్వరాజ్యంతోనే దేశ పురోభివృద్ధి సాధ్యమని మహాత్ముడు భావించారని, దానిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా నిజం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరి జన్మభూమి కమిటీల వేధింపులు లేకుండా గ్రామసచివాలయంలోనే నేరుగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడా చైర్మన్ గురుమోహన్, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, కుప్పాలరమణ, ఆయా పంచాయతీల నాయకులు, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, ఎంపీడీఓ రామకృష్ణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

జగనన్నను ఆశీర్వదించండి

అట్లూరు : బద్వేలు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల తారురోడ్ల నిర్మాణానికి రూ.52 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆశీర్వదించాలని బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ప్రజలను కోరారు. మండల పరిధిలోని మాడపూరు నుండి చిన్నరాసుపల్లె గ్రామానికి 1.3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.15 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆ రోడ్డుకు గురువారం వారు భూమిపూజ నిర్వహించారు. ముందుగా మణ్యంవారిపల్లె సచివాలయ భవనం, మాడపూరు గ్రామ సచివాలయం నూతన భవనాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు రాజవోలు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

15న చెన్నకేశవుని కల్యాణోత్సవం

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 15న ఆదివారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం వైభవంగా జరుపుతున్నట్లు చెప్పారు. అనంతరం దాత వెంకటరమణారెడ్డి సహకారంతో అన్నదానం ఉంటుందన్నారు. కనుమ రోజు పార్వేట నిర్వహించనున్నారు. తదుపరి చియ్యపాడుతో పాటు బసిరెడ్డిపల్లె, రేపల్లె, సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, నెర్రవాడ, గుంతచీపాడు గ్రామాల్లో గ్రామోత్సవ జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా చియ్యపాడులో శనివారం కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. ఆసక్తి గలవారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 15న జరిగే కల్యాణానికి మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఈ.తిరుపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లను ఆహ్వానించామని వీరందరూ హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు.

సంగమేశ్వరుడిని సన్నిధిలో

మండలంలోని వెదురూరులో వెలసిన పార్వతి సమేత సంగమేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 14 నుంచి 16 వరకు సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. భోగి రోజు శనివారం రాత్రి గంటలకు మయూరి కళా నిలయం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు, మకర సంక్రాంతి రోజున ఉదయం ఏకపాత్రాభియన పోటీలు, రాత్రి 8 గంటలకు నెల్లూరు సుస్వర మెగా ఆర్కెస్ట్రా వారిచే సంగీత విభావరితో పాటు మూడు రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వెదురూరు, నరహరిపురం గ్రామాల వద్ద సోమవారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయిలో వృషభరాజములచే బండలాగుడు పోటీలు జరపనున్నట్లు తెలియజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు : పట్టణంలోని ఇద్దరు వ్యాపారుల నుంచి 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. రామేశ్వరంలోని వ్యాపారి వెంకటపతి నూక తయారు చేస్తుండగా 12 బస్తాలను, సుబ్బయ్య అనే వ్యాపారి వద్ద 8 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో మిల్లులెవి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి ప్రసాద్‌రావు పట్టుబడిన బియ్యం ఆటోను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేశారు.

దివ్యాంగుల పింఛన్లపై విచారణ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన దివ్యాంగ పింఛన్‌దారులను గురువారం రిమ్స్ డాక్టర్లు శ్రీనివాసులు, ప్రవన్నకుమార్‌రెడ్డిలు విచారించారు. మల్లేపల్లె ఉప సర్పంచ్ చీలేకాంపల్లె కొండారెడ్డి కొంతమంది దొంగ దివ్యాంగ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు పొందదారని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోగా ఎంపీపీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలపగా ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్లు విచారణకు వచ్చారు. సర్టిఫికెట్లు పొంది పింఛన్ పొందినవారు లింగాలదిన్నెపల్లెలో ఇద్దరు, చెంచయ్యగారిపల్లెలో ఇద్దరి డాక్టర్లు గ్రామ సచివాలయానికి పిలిపించి విచారించారు. రెండు రోజుల్లో దివ్యాంగ సర్టిఫికెట్లతో కడప రిమ్స్‌కు రావాలని డాక్టర్లు పింఛన్‌దారులకు సూచించారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రొద్దుటూరు : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ప్రధాన ఉపన్యాసకులు కరిమద్దేల నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం నుంచి స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో కార్యకర్తలు మోటార్ బైక్‌ర్యాలీగా వివేకానంద క్లాత్ మార్కెట్ వద్దకు వెళ్లారు. అక్కడ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, చీతిరాల నాగార్జున, కాల్వ చలపతి, జింకా మార్కండేయ, బద్వేలు నాగమునిరెడ్డి పాల్గొన్నారు. అలాగే బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోనేటి ప్రదీప్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్వామి వివేకానందుని 160వ జయంతిని పట్టణంలోని పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆధ్యాత్మిక, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. వివేకానందుని గొప్పతనాన్ని ఆయన యువతకు చూపిన మార్గాన్ని పలువురు వక్తలు వివరించారు. స్థానిక గురురాఘవేంద్ర హైస్కూల్‌లో వివేకానందుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎస్‌ఆర్‌ఐటీ కాలేజీలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజనోత్సవాలు నిర్వహించారు. విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ నరసింహారెడ్డి యువత వివేకానంద చూపిన మార్గంలో నడవాలని సూచించారు.



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళి అర్పిస్తున్న స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు

యువతకు మార్గదర్శి స్వామివివేకానంద

పోరుమామిళ్ల : భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచదేశాలకు చాటిన మహోన్నతుడు స్వామి వివేకానంద యువతకు మార్గదర్శి అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వివేకానందభవన్‌లో వివేకానంద 160వ జయంతి సందర్భంగా ఆయన వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

గోపవరం : మండలంలోని మల్లెం కొండేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా రెడ్డిపల్లెగోవిందరెడ్డి, మరో 8 మంది సభ్యులచేత దేవాదాయశాఖ బద్వేలు ఇన్‌చార్జి ఈఓ శివయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. మల్లెంకొండ దిగువ భాగంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరయ్యారు. కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ, సివిల్‌సప్లైస్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, సర్పంచ్ కలువాయిలక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గులను పరిశీలిస్తున్న నటుడు దావూద్, విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు క్రైం : సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని సినీ, టీవీ సీరియల్ నటుడు దావూద్ అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని శాంతినికేతన్‌లో గురువారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నటుడు దావూద్ బహుమతులు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ షఫీఅహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి

బద్వేలు అర్బన్ : దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణలు అన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం కళాశాల ఆవరణలో రంగవల్లుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

స్థానిక పాతిమానగర్‌లోని కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు విజేతలకు బహుమతులను అందజేశారు.

ఆయకట్టు చెరువులకు నీరు విడుదల

బి.కోడూరు : మండలంలోని ఆయకట్టు కింద సాగు చేసిన రైతుల కోరిక మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆదేశాల మేరకు గురువారం పోరుమామిళ్ల చెరువు నుంచి గుండంరాజుపల్లె కాలువ ద్వారా బి.కోడూరు మండలంలోని గుంతపల్లె, బి.కోడూరు, మూలవారిపల్లె, రామసముద్రం, పాయలకుంట్ల, గోవిందాయపల్లె గ్రామాల చెరువులకు మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి నీటిని విడుదల చేశారు.

జగనన్న పాలనకు మద్దతు పలకండి

బద్వేలు : జగనన్న పాలనకు ప్రతిఒక్కరు అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి ఆంధ్రపాలెం ఎస్సీకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్‌ఎంపీపీ చెన్నురాజశేఖర్, సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కలవకూరి రమణ, మహబూబ్‌పీరా, జల్లిచెంద్రాయుడు పాల్గొన్నారు.

రూ.60లక్షలతో ఈద్గా అభివృద్ధి పనులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ నిధులు రూ.60లక్షలతో త్వరలో ఈద్గా పనులను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ముస్లిం మైనారిటీ నాయకులు, అంజుమన్ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంగా ముస్లి మైనారిటీ ప్రజలు ప్రార్థనలు చేసుకునేందుకు అనువుగా కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానం అభివృద్ధికి త్వరలో టెండర్లు నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. డీఈ ప్రభాకర్ దాస్, ఏఈ ఉమామహేశ్వరి, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



డీఈ ప్రభాకర్ దాస్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ఎమ్మెల్యే రాచమల్లుకు కృతజ్ఞతలు

ప్రొద్దుటూరు : ఈద్గా మైదాన అభివృద్ధికి రూ.60లక్షల మంజూరు చేసిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవిలకు మున్సిపల్ వైస్ చైర్మన్ సీఏస్ ఖాజామొహిద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా కోలాటం పోటీలు



ప్రథమ బహుమతి అందుకుంటున్న రవీంద్రహైస్కూల్ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం చిన్మయమిషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోలాటం, గొబ్బిళ్ల నృత్యాల పోటీలను నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని తమ నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. 15 కోలాటం గ్రూపులలో దాదాపు 200 మంది కళాకారులు నృత్య పోటీల్లో పాల్గొన్నారు. సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకు చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించినట్లు బ్రహ్మచారిణి రచన చైతన్య పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్మయమిషన్ అధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్ సుబ్బిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ విజయశ్రీ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కళవతి, భాగ్యలక్ష్మి వ్యవహరించారు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు మునిశంకరయ్య

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.మునిశంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, కొండాపురం, సీకే దిన్నె మండలాల నుంచి ఐదుగురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారు. ఇందులో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి-1, విద్యుత్ లైన్‌కు సంబంధించి-4 సమస్యలు ఉన్నాయి. వీటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈఈ పి. సుబ్రమణ్యం, జేఈ జి.లావణ్య పాల్గొన్నారు.

జామియా మసీదును వక్ఫ్‌బోర్డుకు అప్పగింత



వక్ఫ్‌బోర్డు అధికారులకు మసీదు పత్రాలను అందచేస్తున్న బషీర్ అహ్మద్

ప్రొద్దుటూరు కల్చరల్ : జామియా మసీదును, మసీదు ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు అప్పగించినట్లు జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు బేపారి బషీర్ అహ్మద్ తెలిపారు. గురువారం సాయంత్రం వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ షేక్ అన్వర్‌హుసేన్, షేక్ గౌస్‌బాషాలకు మసీదు ఆస్తుల పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మసీదు కమిటీ అధ్యక్షుడిని అయిన తరువాత మసీదును పునర్ నిర్మించి దశల వారీగా అభివృద్ధి చేశానన్నారు. 30 సంవత్సరాలుగా ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని, ఒక సంవత్సర కాలంగా అవినీతి జరుగుతోందని కొందరు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మసీదుకు సంబంధించి 88 రూములు, 2 స్కూల్ భవనాలు, 1 ఫంక్షన్‌హాల్, 3 ఇళ్లు, చరాస్తుల వివరాలు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో రూ.64,47,000 సేవింగ్ పత్రాలు తదితర అన్ని పత్రాలను, అన్ని రికార్డులను వక్ఫ్‌బోర్డు అధికారులకు అందించారు. మసీదు ఆస్తులకు సంబంధించి హైకోర్టులో 67 సెంట్లు, 32 సెంట్లు స్థలానికి 2 పిటీషన్లు తుది విచారణలో ఉన్నాయన్నారు. వాటిపై వక్ఫ్ అధికారులు దృష్టిసారించి ఆ ఆస్తులు మసీదుకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదు కమిటీ కార్యదర్శి బాబాబాషా, దస్తగిరి బాషా, బేపారి గౌస్‌బాష, జాకీర్ అహమ్మద్, ఇమాం అబ్దుల్ మాలిక్, మౌజన్ ఇజ్రాయెల్, ముల్లా రియాజుద్దీన్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

రాజుపాళెం : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులు తీసుకున్న వివిధ రకాల రుణాలు సకాలంలో చెల్లించాలని ఆ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఆర్.కిశోర్ తెలిపారు. రాజుపాళెం దళితవాడలోని రామాలయం ఆవరణలో గురువారం సాయంత్రం ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులతో కళాజాత బృందం అవగాహన కల్పించింది. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున, అటెండర్ భాస్కర్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలైన కోడిపందేలు, జూదం వంటివి నిర్వహిస్తే అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గతంలో కోడిపందేలు, జూదం కేసుల్లో ఉన్న నిందితులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే కోడిపందేల స్థావరాలు, కోడికత్తులు సరఫరా చేసే వారిని కూడా గుర్తించామని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి కోడిపందేలు, జూదం నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు అందుకు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



లబ్ధిదారురాలికి సంక్షేమాన్ని తెలుపుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

రాజుపాళెం : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని గాదెగూడూరు గ్రామంలో సర్పంచ్ పోలా వరలక్ష్మి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సర్పంచ్ ఇంటి వద్ద కేక్‌ను ఎమ్మెల్యే రాచమల్లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అనిఅడిగి తెలుసుకున్నారు.

రామాలయం, చర్చి నిర్మాణాలకు సహకారం

గ్రామంలో బావి వద్ద ఉన్న రామాలయం, హరిజన వాడలోని రామాలయం, ఎస్సీ కాలనీలో ఉన్న చర్చి నిర్మాణాలకు సహకరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శ్మశానానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు కోరగా, భూ సర్వే కార్యక్రమంలో శ్మశానానికి స్థలం చూపించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ కాలనీలో ఉన్న దర్గాకు ప్రహరీని నిర్మించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరగా, రూ.10లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, ఇందుకు సహకరిస్తానని తెలిపారు. ఎంపీపీ సలోమి, మాజీ ఎంపీటీసీ ఎర్రి రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

నిరుపేద సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బ్రహ్మంగారిమఠం : పార్టీలకతీతంగా ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకం ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తోట్లపల్లె సచివాలయం పరిధిలో రెండవ రోజు పాపిరెడ్డిపల్లె, వడ్డెర కాలనీ, కొత్తపల్లె గ్రామాలో రాత్రి 9గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నిరుపేదలకు అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోట్లపల్లె పంచాయతీలో ప్రభుత్వ ఇప్పటి వరకు రూ 7.50 కోట్లు వివిధ రకాల పథకాల కింద కుటుంబాలకు సంక్షేమం అందించామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేశారన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉన్నారన్నారు. అధికార పార్టీలో ఉన్నా ప్రజల వద్దకు పోతున్నామంటే ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడం వల్లనే అన్నారు. ప్రతిపక్షం, ఎల్లో మీడియాకు ప్రజల సంక్షేమం కన్పించదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణం పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బెంగుళూరు రమణారెడ్డి పాల్గొన్నారు.